సమస్యలు పరిష్కరించకుంటే..
మేమే ధర్నాకు దిగుతాం!

- నగరంలో ఎక్కడికక్కడ ప్రజాసమస్యలు
- అధ్వానంగా పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ
- కనీస వసతులకు నోచుకోని జనం
- పన్నుల వసూళ్లపై ఉన్న శ్రద్ధ..సౌకర్యాల కల్పనపై ఏదీ?
- అభివృద్ధీ లేదు..సంక్షేమమూ లేదు..
- అధికారుల నిర్లక్ష్యంపై కార్పొరేటర్ల ధ్వజం


సమావేశానికి హాజరైన కౌన్సిల్ సభ్యులు



మాట్లాడుతున్న మేయర్ వెంపడాపు విజయలక్ష్మి

విజయనగరం: ప్రజాసమస్యల పరిష్కారంలో కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్య వైఖరిపై కార్పొరేటర్లు గళంవిప్పారు. పన్నులను ప్రజల ముక్కు పిండి మరీ వసూలు చేస్తున్న అధికారులు..అదే ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో ఎందుకు జాప్యం వహిస్తున్నారని నిలదీశారు. నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో మేయరు వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా జీరో అవర్‌లో ప్రజాసమస్యలను సభ్యులు లేవనెత్తి, వాటి పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్య ధోరణిని ఎండగట్టారు. ముఖ్యంగా ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగాల పనితీరు అవినీతి, అక్రమాల మయంగా మారిందని తూర్పారబట్టారు. గడిచిన ఏడాది కాలంలో కార్పొరేషన్ పరిధిలో బ్రిటిష్ పాలన కొనసాగిందని, ఇంకా కొనసాగుతూనే ఉందని ఆవేదన వెల్లగక్కారు. తాము తెలియజేసే సమస్యలు పరిష్కరించకపోతే తామే ధర్నాకు దిగుతామని హెచ్చరించారు.

వీధి దీపాల్లో భారీ కుంభకోణం..

వీధి దీపాల నిర్వహణలో కాంట్రాక్టర్‌ను మార్చేందుకు అధికారులు, కొందరు కాంట్రాక్టర్లు చేతులు కలిపి భారీ కుంభకోణానికి తెరలేపారని స్టాండింగ్ కమిటీ సభ్యులు శెట్టివీర వెంకటరాజేశ్వరరావు ఆరోపించారు. వీధి దీపాల నిర్వహణ ప్రక్రియ లోపభూయిష్టంగా ఉందని, అధిక శాతం మెటీరియల్ కొనుగోలు చేస్తే అందులో సగం సామగ్రిని దొంగలకు దోచిపెడుతున్నారని విమర్శించారు. ఇటువంటి దారుణాలకు ఒడిగడుతున్న సదరు కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టడంతో పాటు దోచుకోబడిన సామగ్రిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే గడిచిన మూడు నెలలుగా వీధీ దీపాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. విద్యుత్ దీపాలను పగలు వెలిగేలా చూసి, రాత్రిళ్లు ఆపేస్తున్నారని అలాంటి వారిపై కేసులు నమోదు చేయాలన్నారు.

అందరి నోటా..అదే మాట..

సమావేశంలో కార్పొరేటర్లు అంతా ఒకే విధమైన సమస్యలపై నీలదీయడం అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిదర్శంగా నిలిచింది. సమావేశంలో కార్పొరేటర్లు బండారు అనంద్, పిన్నింటి కళావతి, గుజ్జల నారాయణరావు, వింతప్రభాకర రెడ్డి, గాదం మురళి, కంటుభుక్త తవిటరాజు, ఆల్తి సత్యకుమారి, మారోజు శ్రీనివాసరావు తదితరులు మాట్లాడుతూ వీధి దీపాల సమస్యను పదే పదే అధికారులకు గుర్తు చేస్తున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో అర్థం కావడం లేదన్నారు. నగరంలో 2 వేల వరకు వీధిదీపాలు వెలగకున్నా అధికారులు తప్పుడు లెక్కలు చూపిస్తూ మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. మెటీరియల్ లేదని, రాలేదని చెబుతూ తప్పించుకోవడం సరికాదన్నారు. పారిశుధ్య పరిస్థితులు కూడా అంత మెరుగ్గా లేవని మరికొంతమంది సభ్యులు ప్రస్తావించారు.పెద్ద డివిజన్‌లలో ఐదు నుంచి ఆరుగురు సిబ్బంది ఉంటే పనులు ఎలా జరుగుతాయని అవసరమైన సిబ్బందిని నియమించాలని అధికారులకు సూచించారు. డబ్బులిస్తేనే కార్పొరేషన్ కార్యాలయంలో పనులు జరుగుతాయన్న విశ్వాసం ప్రజల్లో బలంగా నాటుకపోయిందన్నారు.


ప్రజాసమస్యలపై అధికారులను నిలదీస్తున్న సభ్యులు రాజేష్, వేణు

ప్రోటాకాల్ పాటించరా..?

ప్రజల చేత ఎన్నుకోబడిన కార్పొరేషన్ పాలకవర్గ సభ్యులకు ఇవ్వాల్సిన గౌరవం పట్ల అధికార యంత్రాంగం ఎందుకు నిర్లక్ష్యం వహిస్తుందని కో–ఆప్షన్ సభ్యుడు ఆశపు వేణు, కార్పొరేటర్ కనకల నాగవల్లిలు కమిషనర్‌ను ప్రశ్నించారు. ఇటీవల నగరంలో జరిగిన పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలకు ఎటువంటి హోదా లేని నాయకులతో కొబ్బరికాయలు కొట్టించడాన్ని తప్పుపట్టారు. స్థానిక ఎమ్మెల్యే వస్తే గౌరవం ఇవ్వడం తప్పు కాదని, వారి వెనక వచ్చే వారికి కూడా అధికారులు ప్రాధాన్యమివ్వడం సరికాదన్నారు. కార్పొరేటర్‌లను సైతం పట్టించుకోకుండా కొందరు హోదా లేని రాజకీయ నాయకులకు విలువ ఇవ్వడం ఏంటని ధ్వజమెత్తారు. సచివాలయాల్లో కూడా టీడీపీకి చెందిన నాయకులు చెప్పినట్లే ఉద్యోగులు పని చేస్తున్నారన్నారు. స్పందించిన కమిషనర్ పల్లి నల్లనయ్య..ఇటువంటి పొరపాట్లు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.


ప్రజాప్రతినిధుల ప్రశ్నలకు సమాధానమిస్తున్న కమిషనర్ పల్లి నల్లనయ్య

గత మూడేళ్లూ అభివృద్ధే.. ఈ ఏడాదే అస్తవ్యస్తం..

కార్పొరేషన్ పాలకవర్గం గడిచిన 4 ఏళ్ల పాలనలో 3 ఏళ్ల పాటు మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి హయాంలో అంతా కలిసికట్టుగా అభివృద్ధి పథంలో నగరాన్ని నడిపిస్తే గడిచిన ఏడాది పాలన మొత్తం అంతా అస్తవ్యస్తంగా మారిందని సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక 6వ డివిజన్‌లో పరిధిలోని ప్రశాంతినగర్‌లో పీహెచ్‌సీ, బాలాజీ జంక్షన్‌లోని అంబేడ్కర్ సామాజిక భవన నిర్మాణాలను పూర్తి చేయాలని కార్పొరేటర్ రేగాన రూపాదేవి కోరారు. అలాగే వీటీ అగ్రహారంలో మూడు డివిజన్‌లకు ఉన్న ఒకేఒక్క శ్మశాన వాటికకు వెళ్లే మార్గాన్ని నిర్మించాలని పద్మావతి విజ్ఞప్తి చేశారు. అంతకుముందు 25 అంశాలతో కూడిన అజెండాను సభలో ప్రవేశపెట్టగా అందులోని మూడు అంశాలను తిరస్కరించి, మిగిలిన 23 అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. అలాగే టేబుల్ అజెండాగా మరికొన్ని అంశాలపై చర్చించి, ఆమోదించారు. సమావేశంలో కార్పొరేషన్ డిప్యూటీ మేయర్‌లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయయాదవ్, అసిస్టెంట్ కమిషనర్ కిల్లాన అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో దీపారాధన



నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీసీతారామస్వామి దేవస్థానంలో ఆంజనేయస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి తమలపాకులు, సింధూరంతో అర్చనలు చేసినానంతరం హనుమాన్ చాలీషా పఠనం చేశారు. సాయంత్రం స్వామి సన్నిధిలో భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో దీపారాధన చేపట్టారు.

గంజాయి నిర్మూలనకు చర్యలు తీసుకోండి


సిబ్బందికి సూచనలిస్తున్న జీఆర్‌పీ సీఐ రవికుమార్

విజయనగరం క్రైమ్: నగరంలోని గవర్నమెంట్ రైల్వే పోలీస్‌స్టేషన్‌ను విశాఖ జీఆర్‌పీ సీఐ రవికుమార్ మంగళవారం తనిఖీ చేశారు. అలాగే స్టేషన్ పరిధిలో జరుగుతున్న పలు నేరాలపై ఆరాతీసి, గంజాయి నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైళ్లల్లో నిత్యం ప్రయాణిస్తున్న ప్రయాణికుల భద్రత, రక్షణ, జాగ్రత్త చర్యలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట జీఆర్‌పీ ఎస్‌ఐ బాలాజీరావు తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీ


రైతులకు విత్తనాలు అందజేస్తున్న మండల వ్యవసాయాధికారిణి నీలిమ

పూసపాటిరేగ: మండలంలోని సీహెచ్ అగ్రహారం గ్రామ రైతు సేవా కేంద్రం వద్ద వరి, కంది, రాగులు విత్తనాలను రైతులకు మంగళవారం పంపిణీ చేశారు. రాయితీపై అందజేస్తున్న ఈ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి కె.నీలమ రైతులను కోరారు. ఖరీఫ్ సాగు పనులు మొదలుపెట్టాలని, వరి నారుమడులు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించిన బిల్లులు పంట కాలం పూర్తయ్యే వరకు ఉంచుకోవాలన్నారు. పంటలో ఎప్పుడైనా ఎటువంటి తేడా వచ్చినా వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తకోట శ్రీరాములు, మాజీ సర్పంచ్ పిల్ల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇంటికి వెళ్లి 'రేషన్' ఇవ్వండి


డీలర్లకు సూచనలిస్తున్న తహసీల్దారు రాజారావు

డెంకాడ: గ్రామీణ ప్రాంతాల్లో 65 ఏళ్ల వయసు పైబడిన వృద్ధులకు ఇంటి వద్దకే వెళ్లి, రేషన్ సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దారు రాజారావు డీలర్లను ఆదేశించారు. మండల కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో మండలానికి చెందిన రేషన్ డీలర్లతో మంగళవారం సమావేశమైన ఆయన.. రేషన్ పంపిణీలో జాప్యం చేయవద్దని, సకాలంలో సరుకుల పంపిణీ జరగాలని తెలిపారు. ఎవరైనా అక్రమాలకు పాల్పడినట్లు రుజువైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రేషన్ షాపుల వద్ద పంపిణీ చేసే బోర్డులు కూడా ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో సీఎస్‌డీటీ శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత


వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

విజయనగరం గంటస్తంభం: జిల్లాలో అనధికారికంగా నిర్వహిస్తున్న, అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి పి.గౌరీశంకర్ కోరారు. ఇదే విషయమై జిల్లా కేంద్రంలో జిల్లా విద్యాశాఖాధికారిని మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీకి అంతు లేకుండా పోయిందన్నారు. యూనిఫాం, పుస్తకాల పేరిట ఒక్కో విద్యార్థి దగ్గర నుంచి రూ.లక్షల ఫీజులు వసూలు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సుమన్, భాస్కర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్మన్ పరామర్శ


చాణిక్యను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ సురేష్‌బాబు

విజయనగరం: అనారోగ్యంతో బాధపడుతున్న నగరంలోని 15వ వార్డు కార్పొరేటర్ అల్లు చాణిక్యను జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పరామర్శించారు. ఆయన ఆరోగ్యం బాగాలేదన్న విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్..ఆయన ఇంటికి మంగళవారం వెళ్లి మరీ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. భయపడవద్దని పార్టీ పరంగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు, మాజీ వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగంరెడ్డి బంగారునాయుడు, నగర పార్టీ అధ్యక్షుడు ఆశపు వేణు, నాయకులు రెడ్డి గురుమూర్తి, బొంగ భానుమూర్తి పాల్గొన్నారు.

వర్మీకంపోస్ట్ తయారు చేయండి


క్లాప్‌మిత్రలకు సూచనలు చేస్తున్న డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్

డెంకాడ: ఇంటింటి నుంచి సేకరించిన చెత్త ద్వారా వర్మీకంపోస్ట్ తయారు చేయాలని డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్ క్లాప్‌మిత్రలకు సూచించారు. మండలంలోని పినతాడివాడలో మంగళవారం పర్యటించిన ఆయన అక్కడి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రాల వద్దకు తరలించే చెత్తాచెదారంతో తయారు చేసే ఎరువును రైతులకు కిలో రూ.10 చొప్పున అందజేయాలని తద్వారా పంచాయతీకి అదనపు ఆదాయం సమకూరేలా చూడాలని పంచాయతీ కార్యదర్శి తాడ్డి వెంకటరావుకు సూచించారు. కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న నీటి స్వచ్ఛతను పరీక్షించాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు తెలిపారు. రక్షిత మంచినీటి పథకాల్లో ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చర్యలు చేపట్టాలన్నారు. అలాగే శ్మశానవాటిక దగ్గర జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి, నాణ్యతా ప్రమాణాల మేర పనులు జరగాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ లెంక లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక


ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థిని భవాని


విద్యార్థిని సాహితిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు చలం

పూసపాటిరేగ: మండలంలోని పసపాం, కోనాడ పాఠశాలలకు చెందిన విద్యార్థులు జక్కంపూడి భవాని, దాడిశెట్టి సాహితిలు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఆర్.నాగేశ్వరరావు, చలంలు మంగళవారం తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఈ ఘనత సాధించడం ఆనందంగా ఉందని, విద్యార్థులకు అభినందనలని వారు తెలిపారు. ఈ మేరకు సదరు విద్యార్థులను సిబ్బంది సన్మానించారు.

నెల్లిమర్ల: స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే బాలికల సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రావు ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. యశశ్రీ.. నూజివీడు ట్రిపుల్ ఐటీకి, వాగ్దేవి ఒంగోలు ట్రిపుల్ ఐటీకి, స్వప్న, సత్యవేణి, భాగ్యశ్రీలు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని పేర్కొన్నారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

విజయనగరం క్రైమ్: విజయనగరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దస్తగిరి శ్రీనివాసరావు అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్‌ఐ అశోక్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఇందిరానగర్‌కు చెందిన శ్రీనివాసరావు తన కుటుంబ సభ్యులతో కలిసి బైక్‌పై వెళ్తుండగా వై జంక్షన్ వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో శ్రీనివాసరావుకు గాయాలు కాగా వైద్యసేవల నిమిత్తం దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

నెల్లిమర్ల: పేదల సంక్షేమం కోసం అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ వర్మ కోరారు. స్థానిక పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఓ సమావేశంలో ఆయన కేంద్ర ప్రభుత్వ పథకాలపై కాసేపు మాట్లాడారు. ఇళ్లు లేని నిరుపేదలకు కేంద్రం పీఎం ఆవాస్ యోజన పథకం ద్వారా గృహాలు మంజూరు చేస్తోందని కావాల్సిన వారు దరఖాస్తు చేసుకుంటే అందివ్వడం జరుగుతుందన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించాలి


పినతాడివాడలో రైతులకు సూచనలిస్తున్న ఏవో సంగీత

డెంకాడ: పంటల సాగులో ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించాలని మండల వ్యవసాయాధికారిణి టి.సంగీత సూచించారు. మండలంలోని పెదతాడివాడ, పినతాడివాడ గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆయా ప్రాంతాలకు ఏవో సంగీత వెళ్లి, రైతులకు పలు సూచనలు చేశారు. ఖరీఫ్ సాగు ప్రారంభమవుతున్నందున రైతులంతా ఆధునిక వ్యవసాయ విధానాలను ఆశ్రయించాలని, అలా అయితే నాణ్యమైన పంట, అధిక దిగుబడులు వస్తాయన్నారు. విత్తనం ఎంపిక మొదలుకుని పంట చివరి వరకు ఆధునిక సాగు పద్ధతుల్లో వ్యవసాయ సిబ్బంది సలహాలు, సూచనలు పాటిస్తూ సాగు చేపట్టాలన్నారు. విత్తనాలు వేసే ముందు వాటిని శుద్ధి చేసుకుని వేసుకుంటే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. బస్తా వరి విత్తనాలకు పావు కేజీ సూడోమోనస్ ఫ్లోరెసెన్స్ అనే శిలీంద్రనాసిని పౌడర్‌తో విత్తనాలు శుద్ధిచేయడం ద్వారా పంటకు ఆశించే అగ్గి, పొడ తెగుళ్లు నివారించవచ్చన్నారు. సీడ్ డ్రిల్ విధానంలో వరి ఎద పద్ధతి సాగు చేస్తే సాగు ఖర్చు తగ్గుతుందన్నారు. ప్రతి రైతు సేవా కేంద్రంలో వరి విత్తనాల మొలక శాతాన్ని కట్టగా 90 శాతం వచ్చిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లెంక లక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యుడు విజినిగిరి అచ్చింనాయుడు, మాజీ సర్పంచ్ పల్లె భాస్కరరావు రైతులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

విజయనగరం టౌన్: నగరంలోని ఉడా కాలనీలో జన శిక్షణా సంస్థాన్ వారు అందిస్తున్న ఉచిత వృత్తి నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ డైరెక్టర్ వి.హరీష్ కోరారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను కంప్యూటర్ అసిస్టెంట్, డేటా అనలిస్ట్, సైబర్ సెక్యూరిటీ, మొబైల్ రిపేర్, బేకరీ మేకింగ్, ఎలక్ట్రీషియన్, టైలరింగ్, బ్యూటీషియన్ తదితర కోర్సులను ఉచితంగా అందివ్వడం జరుగుతోందన్నారు. శిక్షణానంతరం సర్టిఫికెట్లు కూడా ఇవ్వడం జరుగుతుందని, ఆసక్తి ఉన్న వారు ఫోన్ నంబరు 9948340591ను సంప్రదించాలని కోరారు.

ఆత్మీయ సమ్మేళనం

విజయనగరం టౌన్: స్థానిక ఎస్‌వీఎన్ లేక్ ప్యాలెస్‌లో జిల్లా వ్యాప్తంగా ఉన్న బ్యూటీషియన్ల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వారు ఉచితంగా ఎంతోమందికి శిక్షణ ఇచ్చి, జీవనోపాధి మెరుగుకు పాటుపడిన తీరును గుర్తు చేసుకున్నారు. భవిష్యత్‌లో మరింతమందికి సేవ చేసేందుకు నిర్ణయించుకున్నారు. బ్యూటీషియన్ కోర్సు ఎంతోమంది మహిళలకు ఉపాధి కల్పిస్తోందని విబా(విజయనగరం బ్యూటీషియన్స్ అసోసియేషన్) అధ్యక్షురాలు బి.భాగ్యలక్ష్మి తెలిపారు. అనంతరం బ్యూటీషియన్ రంగంలో సేవలందిస్తున్న పలువురు మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో విబా వైస్ ప్రెసిడెంట్ పి.మానస తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య తనిఖీలు

విజయనగరం ఫోర్ట్: నగరంలో కుప్పిలి వీధి రెడ్డి సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి వివిధ సమస్యలతో విచ్చేసిన ప్రజలకు వైద్యుడు వేణుగోపాల్‌రెడ్డి ఆరోగ్య తనిఖీలు చేసి, మెరుగైన ఆరోగ్యానికి సలహాలు, సూచనలు చేశారు. ప్రతిరోజూ తినే ఆహారంలో పౌష్టికాహార పదార్థాలు ఉండేలా చూడాలని, భోజనంలో ఉప్పు, కారం, నూనెలు తగ్గించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు ఎస్.సూరిబాబు రెడ్డి, కార్యదర్శి డి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం

విజయనగరం టౌన్: ఆర్యవైశ్య సంఘం అర్బన్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం స్థానిక ఆర్యవైశ్య వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో మంగళవారం జరిగింది. ఆ సంఘ అధ్యక్షుడు కుమ్మరిగుంట శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నూతన సభ్యులంతా ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఉపేంద్ర, రత్నారావు, డిమ్స్ రాజు, ఏడుకొండలు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

విజయనగరం టౌన్: జిల్లాకు చెందిన ప్రముఖ రంగస్థల, సినీ నటుడు దాసరి తిరుపతినాయుడును విశాఖలోని పబ్లిక్ లైబ్రరీలో మంగళవారం సన్మానించారు. ఇందు ఫైవ్‌స్టార్ డ్యాన్స్ ఇనిస్టిట్యూట్ 27వ వార్షికోత్సవం సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధులు తిరుపతినాయుడును దుశ్శాలువ, మెమెంటోలతో సత్కరించారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

విజయనగరం టౌన్: గూడ్స్‌షెడ్ శివాలయం అభివృద్ధికి కృషి చేస్తానని ఆలయ కమిటీ చైర్మన్ రెయ్యి శంకర్‌రెడ్డి తెలిపారు. దాతల సహాయ సహకారాలతో కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ శివమందిరం, శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం ప్రగతి లక్ష్యంగా పనిచేస్తానన్నారు. మాస శివరాత్రి పురస్కరించుకుని శివాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాభివృద్ధికి దాతలు ముందుకురావాలని కోరారు.

చినుకు పడితే చిత్తడే..



డెంకాడ మండలం, మోదవలస పంచాయతీ, గొండయ్యపాలెం రోడ్డు అధ్వానంగా ఉంది. విజయనగరం–విశాఖపట్నం జాతీయ రహదారి పక్కనే ఉన్న ఈ గ్రామానికి సీసీ రోడ్డు సదుపాయం లేదు. ఉన్న మట్టి రోడ్డు..ఏ చిన్నపాటి వర్షం కురిసినా బురదమయమవుతోంది. వానకు చిత్తడి చిత్తడిగా తయారయ్యే ఆ దారిలో నడిచివెళ్లేందుకు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి జారిపడి గాయాలపాలవుతున్నామని వాపోతున్నారు. అధికారంలోకి వస్తే అద్దాల్లా మెరిసే రోడ్లు వేస్తామన్న నాయకులు ఎక్కడ అని ప్రశ్నిస్తున్నారు. తమ బాధలు పట్టవా అని నిలదీస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి, పక్కా రోడ్డు వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. –డెంకాడ

పారిశుధ్య కార్మికుల ధర్నా



బకాయి వేతనాలు చెల్లించాలని విజయనగరం సర్వజన ఆస్పత్రి పారిశుధ్య కార్మికులు మంగళవారం ఆస్పత్రి వద్ద ధర్నాకు దిగారు. ఆ సంఘ నాయకులు అప్పయ్యమ్మ, రామయ్యమ్మలు మాట్లాడుతూ రెండు నెలలుగా జీతాలు అందడం లేదని, అలాగే సమయానికి వేతనాలు ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నపాటి జీతాలకు పనిచేసి, పొట్ట నింపుకునే తమకు ఇలా నెలల తరబడి జీతాలు వేయకపోతే ఎలా బతకాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తక్షణమే బకాయి జీతాలు చెల్లించడంతో పాటు ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలు అందివ్వాలని కోరారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు లక్ష్మి, గణ తదితరులు తదితరులు పాల్గొన్నారు. –విజయనగరం ఫోర్ట్


విగ్రహావిష్కరణ

విజయనగరం టౌన్: నగరంలోని మెసానిక్ టెంపుల్‌లో ఏర్పాటు చేసిన పీవీజీ రాజు విగ్రహాన్ని కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు మంగళవారం ఆవిష్కరించారు. యూనివర్సల్ బ్రదర్ హుడ్ డే పురస్కరించుకుని, చేపట్టిన ఈ కార్యక్రమం అనంతరం పది మంది మూగ, చెవిటి, బధిర పిల్లలను దత్తత తీసుకుని వారి ఫీజుకు గాను రూ.60 వేలు అందజేశారు.

సీనియార్టీ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

విజయనగరం అర్బన్: సమగ్ర శిక్ష విభాగంలో జిల్లా, మండల స్థాయిలలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న సిబ్బంది కోసం సీనియార్టీ జాబితాను రూపొందించామని జిల్లా సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయకర్త ఎ.రామారావు ఓ ప్రకటనలో తెలిపారు. జాబితాలో కేజీబీవీ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్‌పర్సన్స్(ఐఈఆర్‌పీఎస్), క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్లు(సీఆర్‌ఎంటీ), మండల స్థాయి అకౌంటెంట్లు, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్లు, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు(ఆర్ట్, వర్క్, ఫిజికల్ ఎడ్యుకేషన్), డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మెసెంజర్లు, ఆఫీస్ సబార్డినేట్లు, సైట్ ఇంజినీర్లు తదితర పోస్టుల కోసం రిక్వెస్ట్/మ్యూచువల్ రీప్లేస్మెంట్ దరఖాస్తు చేసిన వారి వివరాలు ఉన్నాయన్నారు. సీనియార్టీ జాబితాను 'విజయనగరం.ఏపీ.జీఓవీ.ఐఎన్' వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. అభ్యంతరాలను ఈ నెల 27వ తేదీలోగా కార్యాలయపు పనివేళల్లో జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయానికి సమర్పించాలన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


విజయనగరం టౌన్: అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ మన్మథరావు

విజయనగరం టౌన్: మత్తు పదార్థాల దూరంగా ఉండాలని ఎక్సైజ్ సీఐ కె.మన్మథరావు సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక వీటీ అగ్రహారం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మాదక ద్రవ్యాలు(మత్తు పదార్థాలు) వల్ల కలిగే దుష్ప్రభావాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గంజాయి, కొకైన్, హెరాయిన్, ఖైనీ, గుట్కా, మద్యం, సారా, సిగరెట్ వంటి మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దన్నారు. గంజాయి వాడడం వల్ల చిన్నవయసులోనే బ్రెయిన్‌కు సంబంధించిన సమస్యలు వచ్చి, మృత్యువాత పడుతున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ టీవీ గిరి, ఎస్‌ఐలు ఆర్.రాజకుమార్, టి.సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పూసపాటిరేగ: మాదక ద్రవ్యాల మత్తుతో జీవితాలు చిత్తు(నాశనం) అవుతున్నాయని భోగాపురం ఎక్సైజ్ సీఐ వి.రవికుమార్ తెలిపారు. స్థానిక ఎస్‌వీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాలు నిర్మూలనపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం యువత ఫ్యాషన్ మాయలో పడి చెడు అలవాట్లకు బానిసలై జీవితాలు చెడగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదర్శవంతమైన జీవనం సాగిస్తూ ఉత్తమ పౌరులుగా వెలుగొందాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ చేపట్టి, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.పైడిరాజు, ఎస్‌ఐలు చంద్రమోహన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.